
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024



వర్షాల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి తుఫాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలియజేశారు. సంస్థ పరిధిలోని అనంతపురం సర్కిల్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్స్) డి.ఎస్. వరకుమార్, నెల్లూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్సర్వేషన్, క్వాలిటీ కంట్రోల్) కె. ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్ కు జనరల్ మేనేజర్ (ఐటి, శాప్) సి. హెచ్. రామచంద్ర రావు, కడప సర్కిల్ కు జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్) పి. మురళి, కర్నూల్ సర్కిల్ కు జనరల్ మేనేజర్ (కమర్షియల్) ఎస్.కె. ఇస్మాయిల్ అహమ్మద్ లను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.



పురవీధుల్లో విద్యార్థుల ర్యాలీ

మాదక ద్రవ్యరహిత సమాజాన్ని సృష్టించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని సృష్టించాలని ఎస్‌పి సుబ్బరాయుడు ఉద్ఘాటించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక ర్యాలీని ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ నిర్వహించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎస్‌పి మాట్లాడుతూ దేశంలో ఉన్న సవాళ్లలో మత్తు పదార్థాలు పెనుభూతంలా యువతను పట్టి పీడిస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి వెంకటరావు, డిఎస్‌పిలు వెంకట నారాయణ, రామకృష్ణాచారి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు దుర్వినియోగం చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు బిడ్డ ఎదుగుదలకు మాత్రమే చేయాలని, అలాగాకుండా దుర్వినియోగం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కన్వీనర్ డిఎంహెచ్ఒ శ్రీహరి, అదనపు ఎస్‌పి వెంకట్రావ్ అన్నారు. పిసి అండ్ ఎన్‌డిటి డిస్ట్రిక్ట్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో విన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మీరా, పోలీస్ మెడికల్ ఆఫీసర్ మాధురి పాల్గొన్నారు.





టిటిడి పరిపాలనా భవనం వద్ద రోడ్డుపై భిక్షాటన

శ్రీవారి మెట్టు వ్యాపారుల భిక్షాటన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీవారి మెట్టు మార్గంలో ఉండే చిరు వ్యాపారుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం ముందు గత 11 రోజుల నుండి ఆందోళన చేస్తున్నారు. శనివారం ప్లేట్లుతో జోలి పట్టుకొని తమకు న్యాయం చేయండి అంటూ బిక్షాటన చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ మద్దతు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆర్ . లక్ష్మి , ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ ఇన్ని పోరాటాలు చేస్తున్నా టీటీడీ యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు తక్షణమే ఏదో ఒక నిర్ణయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మల్లీ సోను, మొగిలి, అప్ప రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.



ఉచిత వైద్యసేవలను ప్రారంభిస్తూ...

అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ, ఇహెచ్ఎస్ ద్వారా ఉచిత కంటి వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జిల్లాకార్యదర్శి మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సంస్థ డైరెక్టర్ పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 23 బ్రాంచిలు కలిగిన అతి పెద్ద ఐకేర్ నెట్ వర్కు అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి తిరుపతి బ్రాంచిలో అత్యాధునిక పరికరాలతో నాణ్యమైన కంటి వైద్యాన్ని అందిస్తోంది. శనివారం నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి ఎన్టీఆర్ వైద్యసేవలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ ద్వారా ఉచిత కంటి వైద్యవ అందించనుంది. ఈ సదవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచి హెడ్ తెలిపారు

ఒక్కరోజు ముందే 'పింఛన్'


ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

సెప్టెంబర్ ఒకటో తేదీ ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ ఒకరోజు ముందే లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని పాకాల మండలంపుదిపట్లబైలు పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.



గూడూరులో..

రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో 98 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపిడిఒ శ్రీనివాసులు తెలిపారు. మాజీ ఎంపిపి డి.బిందు మాధవి, పంచాయతీ కార్యదర్శి భువన ఆధ్వర్యంలో అనుప్పల్లిలో పంపిణీ చేశారు. సత్యవేడు మండలం వెంకటరాజులకండ్రిగ గ్రామంలో ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం నేతృత్వంలో అందజేశారు. పొద్దు పొడవక ముందే పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరగడం సిఎం చంద్రబాబు గొప్పతనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పరమశివం (భాషా), మాజీ ఎంపీపీ మస్తాన్ యాదవ్, ఆడిటర్ రోశయ్య, బిఎన్ కండ్రిగలో మండల అభివృద్ధి అధికారి త్రివిక్రమరావు ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఓజిలి మండలంలో సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, సర్పంచి ముసలూరు వీరమ్మ, మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు. గూడూరు ఎంఎల్‌ఎ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 24వ వార్డులో పెన్షన్లను పంపిణీ చేశారు. టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి చెన్నూరులో పంపిణీ చేశారు. పుత్తూరు 20వ వార్డు కల్యాణపురం ఎస్టీ కాలనీలో వెల్ఫేర్ సెక్రటరీతో కలిసి టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు పెన్షన్లు పంపిణీ చేశారు. రూరల్ మండలంలోని తడుకు పంచాయతీ దళితవాడలో టిడిపి చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య పింఛన్లను అందజేశారు. ఏర్పేడు మండలంలోని బండారుపల్లి, మన్నసముద్రం, మేర్లపాక, ఆమందూరు పంచాయతీలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ను రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. తొట్టంబేడు మండలంలో శనివారం ఒక్కరోజే 97.56 శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ సురేష్‌బాబు తెలిపారు. మిగిలిన 162 మందికి సోమవారం అందజేయనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు తెలిపారు. కొణతనేని, ఇలగనూరు పంచాయతీల్లో పాల్గొన్నారు. ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో పైమాలగారి మాధవరెడ్డి అనారోగ్యంతో బర్డ్‌లో చికిత్స పొందుతుండడంతో ఆస్పత్రి వద్దకే ఎఎన్ఎం నిర్మల వెళ్లి పింఛన్ అందించారు.



బర్డ్ ఆస్పత్రిలో...



తొట్టంబేడులో..

నేను వైసిపిలోనే ఉంటా..! : ఆర్‌కె రోజా

ప్రజాశక్తి -తిరుమల

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత మాజీ మంత్రి, నగరి మాజీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా పెద్దగా బయట కనిపించడం లేదు. దీంతో వైసీపీ దారుణ పరాభవంతో ఆమె పార్టీ మారుతున్నారని మాత్రం పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తమిళనాడులో నటుడు విజయ్ పెట్టిన పార్టీలో ఆమె చేరుతారని కొద్దిరోజులుగా వదంతులు వినిపిస్తున్నాయి. ఏపీ రాజకీయాలకు గుడ్‌బై చెప్పి తమిళనాట రాజకీయ ప్రవేశం చేయబోతున్నారనే టాక్ నడుస్తుంది. దీనిపై తాజాగా రోజా స్పందించారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.



శ్రీవారి సేవలో ఆర్‌కె రోజా

పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని.. అదంతా ఊహాగానమే అని రోజా తెలిపారు. తాను ఏ పార్టీ మారడం లేదని రోజా స్పష్టం చేశారు. పార్టీ మారుతున్న వారు ఒకసారి పునరాలోచించుకోవాలని సూచించారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరని తెలిపారు. ఎంతమంది పార్టీ వీడినా వైసీపీకి వచ్చే నష్టమేమీ లేదని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా ఏపీలో మహిళలపై జరిగిన ఘటనల పట్ల కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలని రోజా విమర్శించారు. ఏపీలో మహిళలకు రక్షణ కరువైందని రోజా అన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి ఘటనలో 60 రోజులు అవుతున్నా ఆ పాప శవాన్ని ఇంకా కనిపెట్టలేకపోయారని విమర్శించారు. కాలేజీ హాస్టల్ బాత్‌రూమ్‌లో కెమెరాలు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. గుడ్లవల్లేరులో ఏం జరగలేదని ఎస్పీ అనడం దురదష్టకరమని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై కాకుండా.. మహిళలకు రక్షణ కల్పించడంపై ప్రభుత్వం దష్టిపెట్టాలని హితవు పలికారు.

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్ : డిఇఒ

ప్రజాశక్తి - తిరుపతి

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని డిఇఒ వి.శేఖర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ తిరుచానూరులో తిరుపతి జిల్లా ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల ప్రక్రియపై శనివారం ఒక రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ దరఖాస్తులు ఆన్ లైన్ చేసే సందర్భంలో తరచుగా చోటు చేసుకుంటున్న తప్పిదాలను వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ అడ్మిషన్లు చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సమన్వయకర్త గురుస్వామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు యుపిఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సెప్టెంబర్ 1న ఆదివారం యుపిఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుపతి జిల్లాలోని మూడు కేంద్రాల్లో 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో యుపిఎస్సీ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ సెక్షన్ ఆఫీసర్ శశిభూషణ్, తిరుపతి ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి, సెట్విన్ సిఇఒ మురళీకృష్ణ, ఎపిఎంఐపి సతీష్, డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

'చెకుముకి' సంబరాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - రేణిగుంట

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో జరగనున్న చెకుముకి సంబరాల పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి కుప్పస్వామి, అధ్యక్షులు ఇమామ్, నాయకులు ఒ.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు గుర్రప్ప, దీపికారాణి, ఉమామహేశ్వరి, శారద పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రెండో వెబ్ కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్‌లో బిఎస్‌సి నర్సింగ్, బిపిటి, బిఎస్‌సి పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. 3-4 తేదీల్లో స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందుపరచిన లింక్ ద్వారా కోర్సుల ఎంపికను దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్విమ్స్ వెబ్‌సైట్‌ను వివరాల కోసం సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రోన్లతో దోమల నివారణా మందు పిచికారీ : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో దోమల వద్ధిని నియంత్రించడానికి, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ వద్ద శనివారం డ్రోన్లతో మందును పిచికారి కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో ఎక్కువగా దోమలు వద్ధి చెందుతున్నాయని అన్నారు. వాటిని నివారించేందుకు మనుషులు వెళ్లలేని నీటి కుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. దోమల వద్ధి ఎక్కువగా ఉన్న 32ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ 20 ఎకరాల్లో ఈ మందులు చల్లే కార్యక్రమం చేస్తామని అన్నారు. అలాగే వినాయక చవితి నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ తదితరులు ఉన్నారు.



14 నుంచి స్వచ్ఛతా హి సేవ

దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ సర్వేక్షన్ పోటీల్లో మన తిరుపతిని ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలకు, అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ సర్వేక్షన్ పోటీలపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ లో వందశాతం ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నదని అన్నారు. అయితే ప్రజలు నగరంలో అక్కడక్కడా చెత్త కుప్పలుగా పడేయకుండా మీ ఇంటికి వస్తున్న మా వారికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలని కోరారు. తడి, పొడి చెత్త పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 14 నుండి 15 రోజుల పాటు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞలు, నగరంలో ప్రత్యేకంగా పరిశుభ్రత కార్యక్రమాలు, సఫాయి మిత్రలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. స్వచ్ సర్వేక్షన్లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్స్ చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి ఉన్నారు.

తుడా వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్. మౌర్య

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్ చైర్మన్ ఎన్.మౌర్య అన్నారు. శనివారం సాయంత్రం తుడా వైస్ చెర్మన్ గా ఎన్.మౌర్య పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. తుడా వీసీగా బాధ్యతలు చేపట్టిన మౌర్యను ఇన్‌ఛార్జి వీసి గా పనిచేసిన వెంకట నారాయణతో పాటు నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా చవితి ఉత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తుడ మైదానంలోని ఇండోర్ స్టేడియంలో తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. శనివారం ఉదయం కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిచించారు. ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవం నిర్వహణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. విగ్రహాల ఏర్పాటులో మండప నిర్వహకులు నిబంధనలు పాటించాలని ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందురూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, ఉత్సవ కమిటీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి అజయ్ కుమార్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఊక విజయ్ కుమార్, ఆర్సీ మునికష్ణ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో గ్రామాల్లోనూ, వీధుల్లోనూ వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేవారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను వినియోగించుకుని అనుమతులు పొందాలని ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. అనుమతి పొందగానే క్యూఆర్ కోడ్ వస్తుందని, ఈ కోడ్‌ను ప్రతి వినాయక ఉత్సవ మండపాలకు ముందు తగిలించాల్సి ఉంటుందన్నారు.

సమాచార శాఖ రికార్డు అసిస్టెంట్ సేవలు మరువలేనివి



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

సమాచార శాఖలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సుధాకర్ సేవలు మరువలేనివని, ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య అన్నారు. కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. దాదాపు 31 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సమాచార శాఖలో పనిచేసిన సుధాకర్ ముందుచూపుతో అధికారి అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించేవారని సహచర అధికారులు ప్రశంసించారు. ప్రతిరోజు తిరుపతి జిల్లాలో వివిఐపి, వీఐపీల పర్యటనల నేపథ్యంలో పేపర్ క్లిప్పింగ్స్ సమయానుకూలంగా అందించడం, మీడియాతో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఆటంకం లేకుండా కార్యక్రమాలు విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర చక్కగా నిర్వర్తించారు అని అన్నారు. సమాచార శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్లు చంగల్ రెడ్డి, జయలక్ష్మి మాట్లాడుతూ 32 ఏళ్ల సర్వీస్ కాలంలో రికార్డ్ అసిస్టెంట్ సుధాకర్ ప్రతి అధికారి దగ్గర మన్ననల్ని పొందడంతో తన తోటి సిబ్బంది అందరితో స్నేహభావంతో ఉండి సమన్వయంతో కలిసి పోయి విధులు నిర్వర్తించే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార అధికారులు పురుషోత్తం, వెంకటరమణ, డివిజనల్ పిఆర్ఓ ఈశ్వరమ్మ, ఎ పి ఆర్ ఓ గోపి, రిటైర్డ్ ఏవీఎస్ లు సుబ్రహ్మణ్యం కుమార్ పాల్గొన్నారు.

పులి సాకుతో శ్రీవారి మెట్టు వ్యాపారులు బలి

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అదిగో..పులి...ఇదిగో పులి... చిన్ననాటి కథల్లో సుపరిచితమైన కథ... కానీ ప్రస్తుతం నిజజీవితంలోనూ అన్వయించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎక్కడో చిరుత దాడి చేస్తే... ఆ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేని చోట, దాన్ని సాకుగా చూపి వ్యాపారాలు తీసేయడం విడ్డూరం. వ్యాపారుల కడుపు కొట్టడంతో రోడ్డున పడిన కుటుంబాలు, విధిలేక 12 రోజులుగా నిరసన పోరాటాలు చేస్తున్నా, అధికారులు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం. శ్రీవారినే నమ్ముకున్న శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల దయనీయ పరిస్థితి ఎవరికైనా అయ్యోపాపం అనిపిస్తుంది. అయితే టిటిడిలో మాత్రం ఏమాత్రం చలనం లేకపోవడం శోచనీయం.

దాదాపు 20 సంవత్సరాలుగా శ్రీవారి మెట్టు ప్రాంతంలో సమోసాలు, పబ్బిళ్లలు, బిస్కట్లు, శీతల పానియాలు, టీలు, కాఫీలు అమ్ముకునే చిరువ్యాపారుల కడుపుకొడుతూ టిటిడి వ్యవహరించడం బాధాకరం. తిరుమల ఫుట్ రోడ్లలో పులులు, ఎలుగుబంట్ల సంచారం తరచూ జరుగుతూనే ఉంటాయి. కానీ అలిపిరి నడకమార్గంలో చిరుత సంచారాలతో భక్తుల్లో భయాందోళనలు కలిగాయి. 2023, మే 20న అలిపిరి ఆఖరి మెట్టు వద్ద రెండు చిరుతలు సంచరించాయి. జూన్ 22న 7వ మైలు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆదోనికి చెందిన కుటుంబంలోని ఓ చిన్న బాలుడిని చిరుత నోటకరుచుకుని వెళ్లడాన్ని చూసిన సెక్యూరిటీ గట్టిగా అరవడంతో బాలుడిని కొంత దూరం తీసుకెళ్లి అక్కడే పడేసి పోయింది. గాయాలపాలైన బాలుడిని తిరుపతి బర్డుకు తరలించి, చికిత్స అందించారు. అదే ఏడాది ఆగస్టు 11వ తేది రాత్రి అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నడిచి వెళ్లుతున్న బాలికను చిరుత నోట కరుచుకుని అడవిలోకి తీసుకెళ్లింది. ఉదయం బాలిక శవంగా బయటపడింది. దీంతో నడకమార్గంలో రాకపోకలను టిటిడి నిలిపివేసింది. కొన్ని రోజుల తర్వాత కొంత మంది సెక్యూరిటీతో భక్తులను అనుమతించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఇచ్చారు. తర్వాత చిన్నపిల్లలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇలా దశలవారీగా భక్తులను అనుమతులు ఇచ్చారు. కానీ ఆ సమయంలో అలిపిరి నడకదారిలో, శ్రీవారిమెట్టు మార్గంలో వ్యాపారాలను టిటిడి అధికారులు మూయించేశారు. ఆ తర్వాత వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు. వైసిపి హయాంలో మంత్రి అనుచరులు శ్రీవారి మెట్టుమార్గంలో వ్యాపారాలు చేసుకునే 31 మంది పై దాడి చేసి, అమానుషంగా గాయపరిచారు. దీనిపై వ్యాపారులు ఉద్యమిస్తే, టిటిడి స్పందించకపోగా వ్యాపారాలనే మూయించేశారు. ఇదేమని అడిగితే నడకదారిలో పులి సంచారం ఉందని, వ్యాపారాలకు అనుమతి ఇవ్వమని చెప్పారు. వాస్తవానికి అలిపిరి మార్గంలో చిరుత దాడి జరిగింది. చిరుత దాడి జరిగిన మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. పైగా కొత్తగా షాపులను కూడా కేటాయించారు. ఇందులో ఫారెస్టు అధికారులే ఎక్కువ చొరవ చూపడం గమనార్హం. కానీ చిరుత, వన్యమృగాల సంచారం తక్కువుగా ఉండే శ్రీవారి మెట్టు మార్గంలో మాత్రం వ్యాపారాలకు పులిని సాకుగా చూపి వ్యాపారులను బలిచేయడం బాధాకరం. 20 సంవత్సరాలకు పైగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఉన్నపళంగా వెళ్లగొట్టడంతో 31 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో సిఐటియు ఆధ్వర్యంలో వ్యాపారులు ఐక్యంగా టిటిడి పరిపాలన భవనం వద్ద ఈ నెల 21 నుంచి రిలే దీక్షలకు దిగారు. ప్రతి రోజూ మోకాళ్లపై కుర్చొని, పొర్లుదండాలతో, అర్ధనగ్న ప్రదర్శనలు, ఒంటికాళ్లపై, బిక్షాటన, వంటావార్పు ఇలా రోజుకొక్క రీతిలో వినూత్న పద్దతులో నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా టిటిడి ఉన్నతాధికారులు స్పందించి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారాలుకు న్యాయం చేయాలని వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.

నారాయణలో మెగా వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గూడూరు ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇఎస్ఐ ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వ హించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ విజయకుమారి హాజరయ్యారు. నారాయణ ఇంజనీ రింగ్ కళాశాలలోని 250 అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వి రవిప్రసాద్ మాట్లాడు తూ మారుతున్న జీవన శైలి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. నిత్యం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవటంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ విక్నేశన రెడ్డి, ఎన్ఎస్-ఎస్ అధికారి కోటేశ్వర్‌రావు , సుధీర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే నానిపై బురద చల్లడం మానుకోవాలి..'



మాట్లాడుతున్న రైతు రాము

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమ పిత్రార్జితం వచ్చిన వ్యవసాయ భూమిలో చిన్నపాటి హోటల్ నిర్మించుకోవడానికి తాను ఎమ్మెల్యే పులివర్తి నానికి, టిడిపి మండలా ధ్యక్షుడు సుబ్రహ్మణ్యంకు లక్షల రూపాయలు ఇచ్చానన్న వార్తలు అవాస్తవమని, ఇదంతా ఎమ్మెల్యే పులివర్తి నానిపై బురద చల్లే ప్రయత్నమేనని చంద్రగిరి మండలం రాయలపురానికి చెందిన రైతు సింగంశెట్టి రాము అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనకు పిత్రార్జితం సంక్రమించిన రాయలపురం గ్రామ లెక్క దాకల సర్వే నంబర్లు 312, 313 లోని ఒక ఎకరా 18 సెంట్ల భూమి పక్కనే ఉన్న కాలువ పోరంబోకు స్థలాన్ని హోటల్ కు వచ్చే వాహనాల పార్కింగ్ నిర్వహణకు ఉపయోగించానని, దీన్ని కొందరు జీర్ణించుకోలేక కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగా పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని, తాను టిడిపికి చెందిన వ్యక్తిని అని, తనకు ఎమ్మెల్యే పులివర్తి నానికి మధ్య చిచ్చు పెట్టడానికే ఇదంతా చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రెడ్డిశేఖర్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టిడిపి నేతలు



మంత్రి నారాయణను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను టిడిపి నేతలు నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, టిడిపి నేత నెలవల రాజేష్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి నారాయణ నివాసంలో ఆయనను కలిసిన వారు మంత్రి నారాయణకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ పరిధిలో పలు సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. నాయుడుపేట మున్సిపల్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరారు.

మంగళంలో స్థల వివాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం గ్రామంలో స్థల వివాదం నెలకొంది. గ్రామం సమీపంలో ఉన్న స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని తిరుపతి అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మికి ఫిర్యాదు అందడంతో ఆమె ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం నిర్మాణాలను అడ్డుకున్నారు. తాము ఈ స్థలంకు సంబంధించి రికార్డులను కలిగి ఉన్నామని నిర్మాణదారులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. రికార్డులను దహశీల్దారుకు చూపిన తరువాత నిర్మాణాలు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను ఎంపీడీవోలు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు వడ్డించిన భోజనం లో విషయంలో ఆహార పట్టికను పాటించ లేదని వచ్చిన కథనాలకు స్పందిస్తూ స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవిలు హుటాహుటిన సంబంధిత పాఠశాలను సందర్శించి భోజనశాలను పరిశీలించారు. అనంతరం భోజన పదార్థాలను పరిశీలించి మెనూ ప్రకారం కచ్చితంగా నియమాలు పాటించాలని, పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వారికి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించి విద్యార్థులకు చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచాలని సూచించారు.



బిసి హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపిడివో

పర్యావరణాన్ని కాపాడుకుందాం..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పర్యావరణాన్ని కాపాడుకోవడా నికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అంగన్‌వాడీ కార్యకర్త సురేఖ పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం తొట్టం బేడు మండలం రామచంద్రాపురం లోని అంగన్ వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అంగన్ వాడీ కార్యకర్త సురేఖ విద్యార్థు లతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. మొక్కలు నాటి పచ్చదనం పెంచడం వలన వాతావరణంలో సమతుల్యతను కాపాడ వచ్చన్నారు. మొక్కల పెంపకం వలన గాలిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ తో మనుషులు ఆరోగ్యంగా ఉండవచ్చని సురేఖ అభిప్రా యపడ్డారు. ముఖ్యంగా పచ్చదనంతో వాతావరణ కాలుష్యం అరికట్టవచ్చన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచడం బాధ్యతగా భావించాలని సురేఖ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైను ద్వారా ఉత్సవాలకు అనుమతులు : ఎస్ఐ

ప్రజాశక్తి -తడ: ఆన్‌లైను ద్వారా వినాయకచవితి ఉత్సవాలకు అనుమతులు పొంద వచ్చని యస్ఐ కొండప్ప నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం లోని గ్రామాల్లో, వీధుల్లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సరి కొత్త ఆన్‌లైను వెబ్ సైట్ ను తీసుకొచ్చిందని, ఈ వెబ్ సైట్ ద్వారా వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు సులభంగా అనుమతులు పొందవచ్చునని అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించిందని తెలిపారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వారు ఇక పై హెచ్‌టిటిపిఎస్: డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. గణేష్ ఉత్సవ్.నెట్ ఈ లింక్ ద్వారా వారి వివరాలను రిజిస్టర్ చేసుకొని వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవచ్చునని యస్ ఐ కొండప్ప నాయుడు తెలిపారు. ఈ లింక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులు పొందడంతో పాటు, మీకు అనుమతి పొందగానే ఒక క్యూర్ కోడ్ వస్తుందని, ఆ క్యూర్ కోడ్ ను ప్రతి వినాయక ఉత్సవ మండపాలకు ముందు తగిలించాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా మీ వద్దకు వచ్చే అధికారులకు మీ అనుమతి వివరాలు తెలుస్తాయని యస్ఐ తెలిపారు.

స్వచ్ఛ తాగునీటికి తాళాలు

- పట్టణ ప్రజలకు ఇక్కట్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజలు ఆరోగ్యంగా వుండాలనే ఉద్దేశంతో పట్టణ ప్రజల దాహాన్ని తీర్చేందుకు పుత్తూరు పట్టణంలో స్థానిక వాటర్ ట్యాంక్ స్ట్రీట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను రెండు నెలల క్రితం మూసివేశారు. దీంతో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు కరువై తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. తక్కువ ధర 5 రూపాయలకే 20 లీటర్ల నీరు లభించేది. ఈ ప్లాంటును మూసి వేయడంతో ప్రజలు ప్రైవేటు ప్లాంటు వద్దకు వెళ్లి క్యాను నీటిని 10 నుండి 20 రూపాయలకు కొనుగోలు చేసుకుంటున్నారు.



మూతపడిన స్వచ్ఛ తాగునీటి వాటర్ ప్లాంట్

నూతన ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత ప్రభుత్వ వాటర్ ప్లాంట్‌ను మూసి వేశారు. ఈ కారణంగా ప్రైవేటు వ్యక్తులు ఇష్టా రాజ్యంగా రేట్లు పెంచి అమ్ముకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మళ్లీ ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

కోటి రూపాయల నిధులతో జాతర: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ జాతరను కోటి రూపాయల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ నక్క భానుప్రియ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సెప్టెంబర్ 17, 18వ తేదీల్లో జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో మున్సిపాల్టీ పరిధిలో పలు వున్న పలు సమస్యలను మంచి నీరు, విద్యుత్ లైట్లు 25 వార్డులలో త్వరగా పనులను పూర్తి చేయాలని కమిషనర్‌ను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో అన్ని వాటిలో కౌన్సిలర్లు వారి వార్డుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు వార్డు సమస్యలను ఛైర్ పర్సన్‌కు వినిపించుకున్నా కాలయాపన చేశారన్నారు. కనీసం మున్సిపల్ కార్యాలయంలో జమా ఖర్చుల పుస్తకాలను చూపించకుండా లెక్కలు తెలప కుండా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభు త్వం ప్రకటించినా స్థాని క ఇన్‌ఛార్జి ఒక పైసా ప్రభుత్వం నుండి తెచ్చి ఖర్చు పెట్టలేదని, కానీ ఈ ప్రభుత్వం నుండి జాతరకు కోటి రూపా య లు నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేయించారన్నారు. ఎవరు వచ్చినా ప్రభుత్వం డబ్బు తప్ప తమ సొంత నిధులు ఇంటి నుండి తెచ్చి పెట్టరని అందరూ తెలుసు కోవాలని సూచించారు. కొందరు కౌన్సిలర్లు వివాదాస్పదంగా మాట్లాడినా చివరకు ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం ముగిసింది.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: నేటి సమాజంలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుప్పం బాదూరు పంచాయతీ ఒడ్డి కాలువ దళితవాడలో మండల స్థాయి అధికారులు సివిల్ రైట్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ సెల్ ఫోన్‌కి సైబర్ నేరగాళ్లు మోసాలు చేసేందుకు లింకులు పంపిస్తుంటారని, అందులో బ్లూ అక్షరాలతో లింక్‌ను ఓపెన్ చేసి చూడకూడదని, నేరగాళ్లు ఫోన్ చేసి మీ సెల్ ఫోనుకు ఓటిపి వచ్చింది చెప్పండి..' అని అడిగితే చెప్పొద్దన్నారు. గ్రామాలలో మద్యం బెల్టు షాపుల నిర్వహణ, నాటుసారా తయారీ విక్రయాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. తహశీల్దారు వెంకటరమణ మాట్లాడుతూ దళితులకు భూ సమస్యలు ఏవైనా ఉంటే రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. 18 సంవత్స రాల వయసు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. దళితవాడలో తాగు నీరు, మురుగనీటి కాలువల సమస్య ఉంటే వెంటనే ఎంపీడీవో కార్యాల యానికి ఫిర్యాదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులందరికీ అందుతున్నాయా..? లేదా..?' అని అడిగి అని తెలుసుకున్నారు. కుప్పం బాదురు ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌పై అవగాహన కల్పించి, విద్యుత్ సమస్యలు ఏవైనా వుంటే తెలపాలని గ్రామస్తులను కోరారు. ఈ అవగాహన సదస్సులో ఆర్ఐ జి కృష్ణమ్మ, వీఆర్‌వో టి చిరంజీవి, నీటి పారుదల శాఖ, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై పరిజ్ఞానం పెంచుకోవాలి

వక్తల పిలుపు



జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగు సాహిత్యంపై విద్యార్థులు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ద్రావిడ వర్సిటీ మాజీ విసి ఆచార్య మధు జ్యోతి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో తెలుగు సాహితీ సమితి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు సాహిత్యం మీద ఉపన్యాసాలు పెట్టించడం వల్ల ఒక కోణం నుంచే కాకుండా అనేక కోణాలను నుంచి జ్ఞానాన్ని సముపార్జించవచ్చని అందరూ తెలుసుకోవాలన్నారు. వక్త డాక్టరు ఎల్ కస్తూరి మాట్లాడుతూ ఆదర్శ సమాజ నిర్మాణానికి పాటుపడిన నవయుగ కవి చక్రవర్తి జాషువా రచనల్లో అంటరానితనం వ్యతిరేకత, సంఘ సంస్కరణ, దేశభక్తి ప్రధాన కథా వస్తువులుగా కనిపిస్తాయన్నారు. వీటన్నింటినీ ఆధారంగా చేసుకొని సాంఘిక దురాచారాలపై పాటుపడ్డారని తెలిపారు. అట్టడుగు వర్గాల వారి జీవితాల్లోని వారి బాధలను చెప్పడమే కాకుండా సామాజిక దృక్పథం చైతన్యానికి కారణమైన కట్టు బాట్లను ధిక్కరిం చారన్నారు. సాహితీ సమి తి సలహాదారుగా డాక్టరు డి యువశ్రీ మాట్లాడుతూ సాహిత్యంపై అభిరుచి కలిగిన వారిచే ఉపన్యాసం ఇప్పించడం వల్ల విద్యార్థులకు సాహిత్యం పై మక్కువ పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు వై సుభాషిణి, డాక్టరు బి లక్ష్మీ ప్రియ, పరిశోధక విద్యార్థిని ఎన్ సుమలత, సాహితీ సమితి అధ్యక్షులు కె తేజేశ్వరి,ఉపాధ్యక్షులు పి సుమాంజలి, సమితి కార్యదర్శి ఎస్ గీతాంజలి, కోశాధికారి జి మధు యామిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటినే రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

డీలర్లకు తహశీల్దారు ఆదేశం



డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న తహశీల్దారు పరమేశ్వర్

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ప్రతి నెలా ఒకటవ తేదీనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దారు పరమేశ్వర్ డీలర్లను ఆదేశించారు. మండల రేషన్ షాప్ డీలర్లతో తహశీల్దారు పరమేశ్వర్ రేషన్ సరుకుల పంపిణీపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ ప్రజలకు రేషన్ అందిం చాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రతి వస్తువును ప్రభుత్వ ధరల పట్టిక ప్రకారమే విక్రయించాలని, తూకాలలో అవకతవకలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. స్టాక్ పాయింట్ నుండి రేషన్ షాపులకు దూరం ఎక్కువగా లేకుండా పరిష్కరించాలని తహశీల్దారుకు రేషన్ డీలర్లు విన్నవించు కున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహశీల్దారు హామీ ఇచ్చారు.

బిజెపి, టిడిపి వల్లే ప్రగతి కుంటుపడింది: చింతా మోహన్




మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి -నాయుడుపేట: అధికారం కోసం ప్రజల్లో అనైక్యతను కల్పించేందుకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, దేశంలో ప్రధాని మోడీ ప్రజల్ని విభజించి పాలించాలన్న ఆలోచనతో వర్గీకరణ పేరుతో దళితుల్లో చీలికలు తెస్తున్నారని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ రాష్ట్ర, కేంద్ర విధానాలను దుయ్యబట్టారు. శనివారం ఉదయం నాయుడుపేట ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి గురించి, ఎన్నికల్లో ఆయన చేసిన వాగ్దానాలు గురించి వదిలేసి పింఛన్ల పంచడానికి వెళ్లడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఇందుకు రోజంతా కేటాయించడం అనవసరం అని విమర్శించారు. అధికారం కోసం బిజెపి ప్రధానమంత్రి మోడీ ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఎస్‌సిలను రెచ్చగొడుతుంటే అందుకు చంద్రబాబు వంత పాడుతుండడం హర్షించదగ్గ విషయం కాదన్నారు. బిఆర్ అంబేద్కర్ ఎస్‌సిలు ఐక్యతగా వుండి పురోగతి సాధించాలని సూచిం చారు. అలాంటిది ఎస్సీలలో చీలికలు తెచ్చి అధికార దాహం తీర్చుకుం టున్నారని ఎస్‌సిలందరూ దీన్ని గమనించాలని పిలుపు నిచ్చారు. ఢిల్లీలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నవారికి అడ్డాగా మారిపోయాయని పేదలు ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. వేల, లక్షల కోట్ల రూపాయలు తమవారికి దోచి పెట్టేందుకు నిత్యావసర వస్తువులపై, పన్నుల రూపంలో ప్రజలపై పెనుభారం మోపారని విమర్శించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. శనివారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్ వద్ద మాజీ ఎంపీ చింతా మోహన్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సిల వర్గీకరణ దేశానికే ప్రమాదమని పేర్కొన్నారు. వర్గీకరణ విషయంలో జోక్యం చేసుకొని బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలి పోయిందన్నారు. వర్గీకరణ విషయంపై మోడీ, చంద్రబాబు ఇద్దరూ కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. తిరుమలలో కొట్లాది రూపాయలు ధనం దుర్వినియోగం అవుతోందని. విఐపి బ్రేక్ దర్శనాల టికెట్లను కొంతమంది దళారులు బ్లాక్ లో అమ్ముకోవడం అన్యాయమన్నారు. సెప్టెంబర్ 6 వతేదీ తమ్మిన పట్నంకు వస్తున్న ప్రధాని మోడీ విభజన హామీ చట్టంలోని దుగరాజపట్నం ఓడరేవుకు శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామకృష్ణారావు, దర్శి నాగ భూషణం, తాజుద్దీన్ పాల్గొన్నారు.

డిటిసిగా ఆదినారాయణకు ఉద్యోగోన్నతి



డిటిసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదినారాయణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణకు డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా నియమిస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారిగా ఆరు నెలలుగా ఆదినారాయణ బాధ్యతలు నిర్వ ర్తించారు.

బోరు మోటారుకు మరమ్మతులు



పాత బోరుకు మరమ్మతులు చేపట్టిన మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘం పరిధిలోని మిట్టపల్లూరు, మిట్టపల్లూరు ఆది ఆంధ్రవాడ, పాతపల్లూరు గ్రామానికి తాగునీటి సరఫరాకు గతంలో మిట్టపల్లూరులోని పొలం బోరు నుండి నీటిని సరఫరా చేసేవారు. రెండు సంవత్సరాల క్రితం ఈ గ్రామాలకు మిట్ట పల్లూరు శ్మశానంలోకి బోరుకు మార్చడంతో గ్రామస్తులు శ్మశానం నుండి వచ్చే నీళ్ల వద్దని మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందించారు. ప్రజల బిగించి నీటిని సరఫరా చేయనున్నారు. నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు టిడిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి చొరవ తీసుకుని మరమ్మతుకు గురైన బోరు మోటారుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు నీటి సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. స్పందిం చిన ఎమ్మెల్యేకు, టిడిపి నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'అవినీతి మచ్చను చెరిపేయండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పంచాయతీల పాలనలో గత వైసిపి ప్రభుత్వ అవినీతి మచ్చను చెరిపేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ సెక్రటరీ పామంజి సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను కోరారు. సీఎం చంద్రబాబును ఆయన శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ. 2600 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలనలో కేంద్రం ఇచ్చిన రూ. 7,600 కోట్ల నిధులను పక్కదారి పట్టించి దుర్వినియోగం చేశారని సుబ్రహ్మణ్యం అన్నారు. ఆ తాలూకా అవినీతి మచ్చ కూటమి ప్రభుత్వంపై పడకుండా పాలన సాగించడం శుభ పరిణామం అన్నారు.

ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలోని ప్రతిష్టాత్మక ప్రాచ్య పరిశోధన సంస్థ అధికారికంగా కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. వెబ్‌సైట్‌ను శనివారం 3.30 గంటలకు ఎస్వీయూ వీసీ ఆచార్య అప్పారావు శనివారం బీసీ చాంబర్లో అధికారికంగా ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించబడిన ఓఆర్ఐ వెబ్‌సైట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పండితులు, పరిశోధకులు, ఔత్సాహికులకు విస్తారమైన జ్ఞానాన్ని అందిస్తుందని, ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అనేది అమూల్యమైన తాళపత్రాలు, గత తరాల జ్ఞానాన్ని భద్రపరిచే రచనల నిధి' అని అప్పారావు అన్నారు. ఈ కొత్త డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ఓరియంటల్ స్టడీస్‌పై లోతైన అవగాహనను పెంపొందించడానికి ఉపకరిస్తుందని, భారతీయ జ్ఞాన సంపదను ప్రపంచంతో పంచుకోవడానికి సహాయం చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయం నూతన సాంకేతికతలను ఆవిష్కరిస్తూ, అకడమిక్ , పరిశోధన రంగాలను మరింత మెరుగుపరిచే భవిష్యత్ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు, డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, డీన్లు ఆచార్య దామోదర రెడ్డి, ఆచార్య నరసింహులు, ఆచార్య బాలాజీ, ఆచార్య రాజేశ్వరమ్మ, కంప్యూటర్ సెంటర్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టరు సి ఫణిరమేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం) కరకంబాడి మార్గంలో ఉన్న ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ప్రభుత్వ సంస్థ డిపార్ట్మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ వారి ఆర్థిక సహకారంతో చిప్ డిజైన్, ఐఓటి అప్లికేషన్ అనే అంశాలలో రెండు రోజులపాటు జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా నానో చిప్ సొల్యూషన్స్ సీఈఓ డాక్టర్ హరికష్ణన్, విశిష్ట ఆహ్వానితుడుగా సెనారీస్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ సిరిల్ ప్రసన్న రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ సి.చంద్రశేఖర్ లు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. టిసిఎస్ కు చెందిన సీనియర్ డిజైన్ లీడ్ అర్జున్ హరినాగ్, తిరుపతి ఐఐటీకి చెందిన ఆచార్యులు డాక్టర్ ఎన్ ఎన్ మూర్తి, సెన్నాప్సిక్ కి చెందిన డాక్టర్ శివానంద, ఐఐటీ ఢిల్లీకి చెందిన డాక్టర్ రామ్ గోపాల్ రావు, ఐఐటి తిరుపతి ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు వివిధ సెషన్స్ లలో తమ పరిశోధనలను, అంశాలను అభ్యర్థులకు వివరించారు.

ప్రకృతి సాగును పరిశీలించిన తమిళనాడు రైతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తమిళనాడు మహిళా రైతులు పరిశీలించారు. వేమూరు గ్రామంలోని అయ్యప్ప నాయుడు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తమిళనాడు గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చింది. తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం తమిళనాడు బృందానికి ప్రకతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. చిన్న సన్న కారు రైతులకు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల పంటలు వేసుకొని నెలకు పదివేల రూపాయలు ఆదాయం వచ్చే విధంగా ఈ ఎనీ టైం మనీ మాడల్ గురించి వివరించారు. అయ్యప్ప నాయుడు పొలంలో 20 సెంట్లులో వేసిన మోడల్ గురించి మహిళా బృందం అడిగి తెలుసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది మధు, నీలమ్మ రాధిక, ధరణి, శ్రావణి, చెంచు లక్ష్మి పాల్గొన్నారు.

రైతుకు అన్యాయంపై ఖండన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం కందాడ పంచాయతీ రాజుల కండ్రిక గ్రామానికి చెందిన సాల్వ సుబ్బరాజు కుమారుడు సురేంద్ర రాజు అనే రైతుకు గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుడు వల్ల భూమి కోల్పోయాడని టిడిపి నాయకులు తీవ్రంగా ఖండిస్తూ ఆవేదన చెందుతున్న రైతు పట్ల న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై వుందని పేర్కొన్నారు. ఏర్పేడు సిఐ, తహశీల్దారు వెంటనే విచారణ జరిపి ఈ సమస్యకు కారణమైన వ్యక్తులపై చట్టపర చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు.

గ్రామ సమస్యలు పరిష్కరిస్తా: తహశీల్దారు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దారు పేర్కొన్నారు. మండలంలోని కూరపర్తివారిపల్లి పంచాయతీ గంపల మాదిగపల్లిలో పౌరహక్కుల దినోత్సవం శనివారం తహశీల్దారు పరమేశ్వర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు శ్మశానవాటిక, రోడ్లు, అంగన్‌వాడీ, దారి సమస్యలు, ఇంటి స్థలాల పై తహశీల్దారుకు అర్జీలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరారు. గ్రామంలో చాలా మందికి భూములు ఉన్నా రికార్డు లేవని భూ సమస్యలు పరిష్కరించి హద్దులు చూపించాలని తహశీల్దారుని కోరారు. గ్రామంలో శ్మశానం కోసం తన సొంత భూమిని ఇచ్చి ప్రభుత్వం తరపున మరింత అభివృద్ధి చేస్తామని, తాగునీరు, రోడ్లు, వేయిస్తామని టిడిపి జిల్లా కార్యదర్శి అన్న సముద్రం మధు పేర్కొన్నారు. గ్రామ అభివృదికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక శ్రద్ధతో ప్రతి నెలా సమావేశాల్లో సమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దారు పరమేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఈశ్వరమ్మ, సర్పంచ్ జయమ్మ, దళిత సంఘ నాయకులు పల్లిపాక నాగరాజు, పాటూరు రెడ్డప్ప, కుంభ నాగరాజు, భాకరాపేట హెచ్ డబ్ల్యూ ఓ, శేఖర్ బాబు, ఆర్ఐ జానకిరామ్, వీఆర్వోలు సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: తహశీల్దారు జనార్దన్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం చిగురాల చెరువు మాదిగ పల్లెలో జరిగింది. ఈ సమావేశంలో మండల తహశీల్దా రు జనార్ధన్, విఆర్వోలు, వార్డన్ ప్రసంగించారు. అన్ని దళిత సమస్యలను పరిష్కరిస్తామని, అంటరానితనం ఉండకూడదన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య లు ఉన్నా పరిష్కరిస్తామని భూమి కొలతల పైన సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. పిల్లల అభివృద్ధి కి హాస్టల్‌లో చేర్చుకుని వారికి మంచి భోజన వసతి, మంచి విద్యా బోధన కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్యలు, బంజర భూములు అన్యాక్రాంతమైన వాటిని పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు గురుశంకర ప్రసాద్, దళిత రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్తులు, మహిళా రైతులు నీరజ, వసంతమ్మ ,ఆదమ్మ, బేబీ నీరజ, లావణ్య ప్రవళిక, జయలక్ష్మి, గురుమూర్తి, మల్లికార్జున సిద్దయ్య వెంకట సామయ్య పాల్గొన్నారు. చంద్రశేఖర్ సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యర్రావారిపాల్యెంలో..

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు: సీఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ డి.గోపి సూచించారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వుల మేరకు శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ డి గోపి మాట్లాడుతూ.. కొంతమంది యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవితను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇక ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోపి కోరారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించకూడదన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.